క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరుడి శోభాయాత్ర



దుగ్గొండి : మండలంలోని కేశవాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు గురువారం ఉదయం యాగశాలలో నిత్యారాధన, మహా కుంభస్థాపన, అగ్ని ప్రతిష్ట, ధ్వజాధివాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టి ధ్వజారోహణ చేశారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీదేవ భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి విగ్రహాలను శేషవాహనంపై ఉంచి కేశవాపురం నుంచి నీరుకుళ్ల వరకు శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కంది తిరుపతిరెడ్డి పూలమ్మ, జితేందర్ రెడ్డి సరళ, మనోహర్‌రెడ్డి కృష్ణవేణి, అభినయ్‌రెడ్డి శ్రేయా, ఈఓ కిరణ్‌కుమార్, అర్చకులు దేశికన్‌చార్యులు, లక్ష్మీనర్సింహాచార్యులు, ప్రదీప్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

కళ్లద్దాల పంపిణీ



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కేజీబీవీలో చదువుకుంటున్న పలువురు విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే బృందం గురువారం కళ్లద్దాలు పంపిణీ చేసింది. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్లు స్వర్ణలత, భవిత మాట్లాడారు. విద్యార్థినులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ స్మిత, ఏఎస్‌ఎం జులేఖ, విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాల్లో విద్యార్థుల ప్రతిభ



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన కాకతీయ స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ ఇటీవల నిర్వహించిన గురుకుల పాఠశాలల ప్రవేశాల పరీక్షల్లో 5వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటారని హెచ్‌ఎం గొడిశాల శ్రీనివాస్ తెలిపారు. స్కూల్ ఆవరణలో గురువారం ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. విద్యార్థులు ప్రతిభ చాటడంతో ఉపాధ్యాయుల కృషి కీలకమని చెప్పారు. తల్లిదండ్రుల సహరానం వల్లే స్కూల్ నుంచి 15 మంది విద్యార్థులు పరీక్ష రాని అర్హత సాధించారని వివరించారు.

'ఆర్‌డీఎఫ్'కు ఫ్యాన్ల వితరణ



పర్వతగిరి : మండలంలోని రోళ్లకల్ గ్రామంలోని ఆర్‌డీఎఫ్ పాఠశాలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్‌ఎంసీ) చైర్మన్ కందకట్ల ప్రకాశ్ డైనింగ్ హాలులో ఏర్పాటు చేసేందుకు గురువారం ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి ఎళ్లవేళలా ముందుంటానని చెప్పారు. అనంతరం హెచ్‌ఎం రాములు మాట్లాడారు. వేసవి నేపథ్యంలో విద్యార్థుల ఇబ్బందులను దూరం చేసేలా ఫ్యాన్లు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్, ప్రైమరీ స్కూల్ ఇన్‌చార్జ్ బాలరాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

నర్సంపేట: సంస్కృతంలోని రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన ఆతుకూరి మొల్ల మాంబ జయంతిని పట్టణంలో గురువారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళు లర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, మండల అధ్యక్షుడు భిక్షపతి, సాంబయ్య, ఎర్రయ్య, నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే ఉద్యోగాల భర్తీ'

వర్ధన్నపేట : కాంగ్రెస్ హయాంలోనే ఉద్యోగాల భర్తీ జరుగుతోందని డీఎస్‌ఎస్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు. పట్టణంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుమారు 55 వేల ఉద్యోగాలను భర్తీ చేయడంతోపాటు గ్రూప్–1, గ్రూప్–2 పరీక్షలు నిర్వహించి ఫలితాలు అందించిందని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డికి పట్టణంలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేసి ఎమ్మెల్యే నాగరాజు, ఎంపీ కడియం కావ్యను ఆహ్వానించి పాలాభిషేకం చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు కంజర్ల సమ్మయ్య, మిథున్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు సెక్టార్లుగా గిర్నిబావి

- కొమ్మాల జాతరకు వెళ్లే ప్రభలతో ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు
- ప్రధాన రహదారిపై చెక్‌పోస్టులు, బారికేడ్ల ఏర్పాటు



ప్రధాన రహదారిపై బారికేడ్లు, ట్రాఫిక్ కోన్స్



ఏసీపీతో మాట్లాడుతున్న డీసీపీ అంకిత్‌కుమార్

దుగ్గొండి: గీసుకొండ మండలంలోని కొమ్మాల జాతరకు వెళ్లే ప్రభబండ్లతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గిర్నిబావి పరిసర ప్రాంతాలను నాలుగు సెక్టార్లుగా విభజించారు. బారికేడ్లు, ట్రాఫిక్ కోన్స్ అందుబాటులో ఉంచారు. ట్రాఫిక్ మళ్లింపునకు ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేశారు. వాహనాల రద్దీ ఎక్కువ ఉంటే వరంగల్ నుంచి వచ్చే బస్సులు మచ్చాపురం, చెన్నారావుపేట మీదుగా నర్సంపేటకు, నర్సంపేట నుంచి మల్లంపల్లి, ఆత్మకూరు మీదుగా వరంగల్‌కు, ఇటు ఎలుకుర్తి, లక్ష్మీపురం, నాచినపల్లి తొగర్రాయి మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. గిర్నిబావిలో ఒకేసారి ప్రభలు భారీగా రాకుండా చాపలబండ రోడ్డు, దుగ్గొండి రోడ్డులో శాశ్వత చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. నర్సంపేట వైపు గిర్నిబావిలో రాజు ఫిల్లింగ్ స్టేషన్ వద్ద తాత్కాలిక బస్టాండ్, వరంగల్ వైపు జీఆర్‌బీ ఫంక్షన్ హాల్ వద్ద బస్టాండ్ ఏర్పాటు చేశారు. రెండు బస్టాండ్ల నడుమ ఆర్టీసీ బస్సులు నడుస్తాయి. శనివారం ఎన్ని ప్రభబండ్లు, ఎంతమంది భక్తులు వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. ఆర్టీసీ, హెల్త్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది సైతం విధులు నిర్వర్తిస్తారు. గతంలో మాదిరిగా ట్రాఫిక్ సమస్య రాకుండా వరంగల్ ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ స్వయంగా పర్యవేక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

100 ప్రభలు.. 20 వేల మంది కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న తరుణంలో వివిధ గ్రామాల నుంచి ప్రభలు భారీగా జాతరకు రానున్నాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీల కార్యకర్తలు 80 ప్రభలు తయారు చేస్తున్నారు. నర్సంపేట, చెన్నారావుపేట., నల్లబెల్లి మండలాల నుంచి 20 ప్రభలు సిద్ధం అవుతున్నాయి. ఒక్కో బండి వద్ద 200 మందికి తగ్గకుండా కార్యకర్తలు ఉంటారు. ఇలా సుమారు 20 వేల మంది కార్యకర్తలు శనివారం ఉదయం గిర్నిబావికి చేరనున్నారు.

దూరం పాటించాలి

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర నేడు ప్రారంభం కానుండగా ఈసారి జాతరలో వైరి పార్టీలతో కాకుండా స్థానిక కాంగ్రెస్ నాయకుల మధ్య వివాదం నెలకొంది. కొండా, రేవూరి వర్గాలు ప్రభ బండ్లను సిద్ధం చేస్తున్నాయి. ఎవరిది ముందుండాలనే విషయంలో వివాదం నెలకొనగా డీసీపీ అంకిత్‌కుమార్ ఇరు వర్గాలకు దిశానిర్దేశం చేశారు. రేవూరి వర్గం ప్రభ ముందు, దానికి వంద మీటర్ల దూరంలో కొండా వర్గం ప్రభలు ఉండాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ అద్దంకి దయాకర్ తెలిపారు. క్యూలైన్లు, చలువ పందిళ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని చెప్పారు. డీపీఓ కటకం కల్పన, డీఎల్‌పీఓ వేదవతి, ఎంపీఓ ప్రభాకర్ జాతర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను సమీక్షించారు. దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సునీత, అధికారి అనిల్ ఆలయ పరిసరాల్లో పర్యటించి జాతర విజయవంతానికి సూచనలు చేశారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, ఉద్యోగావకాశాలు



విద్యార్థులతో ఎన్‌సీసీ ఆఫీసర్లు, ప్రిన్సిపాల్, తదితరులు

నర్సంపేట రూరల్ : ఎన్‌సీసీతో విద్యార్థులకు క్రమశిక్షణ అలవడడమే కాకుండా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఎన్‌సీసీ టెన్త్ బెటాలియన్ ఆఫీసర్లు విజయ, దీపక్, బాలాజీ స్కూల్ ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్ తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్ ఆధ్వర్యంలో 2025–26 విద్యాసంవత్సరానికి గాను గురువారం 185 మంది విద్యార్థులను పరీక్షించి 49 మందికి అర్హులుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆఫీసర్లు మాట్లాడారు. విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలాజీ స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఎన్‌సీసీ పాత్ర క్రియాశీలకమని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు భవానీ చంద్, పార్వతి, వినోద్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



ఖానాపురం : మండలంలోని బుధరావుపేట ప్రభుత్వ, మోడల్ స్కూళ్ల విద్యార్థులకు కాంగ్రెస్ యువజన నాయకుడు దొంతి అవియుక్త్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు గురువారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మోడెం ఎల్లగౌడ్ మాట్లాడారు. విద్యార్థులు పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. చదువులో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు పడతాయని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, హరీశ్, శివాచారి, అక్రమ్, నాగరాజు, పాషా, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కీడు సోకిందని వనభోజనాలు



దుగ్గొండి : మండలంలోని గుడ్డెలుగులపల్లికి కీడు సోకిందంటూ ప్రజలు గురువారం వనభోజనాలకు వెళ్లారు. గ్రామంలో 600 జనాభా ఉంటారు. గడచినా ఆర్నెళ్లలో వేర్వేరు కారణాలతో 13 మంది మృతి చెందారు. ఈ క్రమంలో గ్రామస్తులు ఓ పండితుడిని సంప్రదించగా గ్రామానికి కీడు సోకిందని సెలవిచ్చినట్టు సమాచారం. గ్రామస్తులు తెల్లవారు జామునే గ్రామ పొలిమేరలో వనభోజనాలకు వెళ్లారు. వనదేవతలకు మొక్కులు చెల్లించారు.

ఎస్సారెస్పీ డీఈ తీరు సరికాదు

- సొసైటీ డైరెక్టర్ గంగాధర్‌రావు

పర్వతగిరి : మండల కేంద్రంలోని రిజర్వాయర్‌కు నీరు వదలకుండా ఎస్సారెస్పీ డీఈ వ్యవహరిస్తున్న తీరు సరికాదని సొసైటీ డైరెక్టర్ జూలపల్లి గంగాధర్ రావు అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కూసం రాంచందర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన రిజర్వాయర్ సాగు, తాగునీటికి ఉపయోగపడుతున్న అందులోకి నీరు రావడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. రిజర్వాయర్‌లో చేపలు పట్టే వారితో కుమ్మక్కై ఎస్సారెస్పీ కెనాల్‌లోకి నీరు రాకుండా తూము వద్ద రేయింబవళ్లు ఒకరిని ఉంచుతున్నాడని ఆరోపించారు. చెరువు నీరు ఉప్పుగా అవుతండడం వల్లే వదలడం లేదని సాకులు చెబుతున్నారని తెలిపారు. ఎస్సారెస్పీ కాల్వ మట్టిని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకోవడం లేదని, రిజర్వాయర్‌లోకి నీరు తీసుకొచ్చేందుకు రైతులు వెళ్తే కేసులు పెడతానని బెదిరింపులకు గురి చేస్తున్నాడని చెప్పారు. ఎస్సారెస్పీ ఎస్ఈ స్పందించి డీఈ తీరుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంతోపాటు రిజర్వాయర్‌లోకి నీరు వదిలేలా చొరవ చూపాలని కోరారు. సమావేశంలో కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పిన్నింటి సునీల్‌రావు, ఐనవోలు ఆలయ కమిటీ డైరెక్టర్ దారం పూర్ణచందర్, నాయకులు సురేందర్‌రావు, అజయ్‌రావు, కంటెం సుధాకర్, నరెడ్ల మారయ్య, జంగ సాంబయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీలో యథావిధిగా రాకపోకలు

సంగెం : మండలంలోని ఎల్గూర్ రంగంపేట రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) మరమ్మతుల అనంతరం గురువారం తెరుచుకోగా రాకపోకలు యదావిధిగా సాగినట్టు తహసీల్దార్ గనిపాక రాజ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్రిడ్జిలో గుంతలు తేలి ప్రయాణికులకు ఇబ్బందిగా మారడంతో రైల్వే అధికారులు రాకపోకలు నిలిపివేసి మరమ్మతు పనులు చేయించారని పేర్కొన్నారు. గురువారం నుంచి పూర్తిస్థాయిలో రాకపోకలు పునరుద్ధరించినట్టు వివరించారు. ఎల్గూర్ రంగంపేట, పరిసర గ్రామాల ప్రజలు సహకరించారంటూ కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం పరిపాలన దినోత్సవం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని ముత్తోజిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా, సింధూర, ఎంఈఓగా లాస్య, పీఈటీగా రాహుల్, ఉపాధ్యాయులుగా విష్ణువర్ధన్, వైష్ణవి, చరణ్, చరన, పూర్ణశ్రీ, నిఖిత, శివమణి, స్వాతి, ఉదయ్, తస్లీమా, శ్రీజ, ఝాన్సీ, సాత్విక్, అక్షర, ధనుశ్, మనోజ్, హరితేజ, సహస్ర వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ వీణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ఒక్క పూట నిర్వహించాలి

నర్సంపేట : అంగన్‌వాడీ కేంద్రాలను మే నెలలో ఒక పూట మాత్రమే నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (బీఆర్‌టీయూ అనుబంధం) రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం మహిళాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, కమిషనర్ కాంతి వెస్లీలను గురువారం కలిసి వినతిపత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా భారతి మాట్లాడారు. ఏటా మే నెలలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు 15 రోజులు సెలవు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్ల, వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాతార, కోశాధికారి వేదవతి, రాష్ట్ర నాయకులు ఎల్లమ్మ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

కాల్ సెంటర్‌లో ఉద్యోగాలు

రాయపర్తి : దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎస్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలోని కాల్ సెంటర్లలో 100 ఉద్యోగ అవకాశాలున్నట్టు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, వరంగల్ కార్యాలయాల్లో 50 మంది చొప్పున స్త్రీ, పురుషులను నియమిస్తామని పేర్కొన్నారు. వేతనం రూ.12 వేల వేతనం తోపాటు భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 9505682726లో సంప్రదించాలని కోరారు.

'వ్యవసాయ రంగం నిర్వీర్యానికి కుట్ర'

నర్సంపేట : వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేలా పాలకులు కుట్ర చేస్తున్నారని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓంకార్ భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని 70 శాతం జనాభా వ్యవసాయం, అనుబంధ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తుండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న, సన్నకారు రైతులకు ప్రోత్సాహకాలు ప్రకటించకుండా కార్పొరేట్ వ్యవసాయానికి రాయితీలు, సబ్సిడీలు, మాఫీలు ఇస్తున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇస్మాయిల్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబురావు, జిల్లా నాయకులు కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించాలి

వర్ధన్నపేట : ఈనెల 15 నుంచి ఏప్రిల్ 14 వరకు మహనీయుల జయంతి వేడుకలు నిర్వహించాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మామిండ్ల చెన్నయ్య కోరారు. పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15న కాన్షీరామ్ జయంతితో ప్రారంభమై ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతితో ముగించాలని సూచించారు. ఏప్రిల్ 5న బాపు జగ్జీవన్‌రామ్, 11న జ్యోతిరావు పూలే జయంతులను అధికారికంగా నిర్వహించాలన్నారు.

మత్తుపదార్థాలతో ఆరోగ్యానికి హాని



రాయపర్తి : మత్తుపదార్థాలతో ఆరోగ్యానికి హాని కలుగుతుందని ఎక్సైజ్ సీఐ స్వరూప తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాల్లో భాగంగా మండలంలోని కొండూరు ప్రభుత్వ హైస్కూల్‌లో జెండర్ ఈక్వాలిటీ గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడారు. మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. తల్లిదండ్రులకు సైతం అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం సీఐ స్వరూపను, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, ఉపాధ్యాయులు, సిబ్బంది సత్యం, రాంరెడ్డి, ఆచార్య, సత్యనారాయణ, రఘు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం



కరపత్రాలు, పోస్టర్లను ప్రదర్శిస్తున్న శోభారాణి, తదితరులు

- 'సఖి' లీగల్ కౌన్సిలర్ శోభారాణి

నెక్కొండ : సమాజంలో మహిళల పాత్ర కీలకమని వరంగల్ సఖి సెంటర్ లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని అలంకానిపేట, గుండ్ర పల్లి గ్రామాల్లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గురువారం మహిళా సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా సమాజ ఉన్నతిలో భాగస్వాములు కావాలని సూచించారు. సాంకేతికతను ఉపయోగించుకుంటూ అన్ని రంగాల్లో ముందుకు సాగాలన్నారు. మహిళల, బాలికల భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్ల ద్వారా సేవలు అందిస్తున్నాయని తెలిపారు. బాధిత మహిళలకు పోలీస్, న్యాయ, వైద్య సహాయంతోపాటు తాత్కాలిక వసతి కల్పించడానికి సఖి కేంద్రం ప్రతిక్షణం అందుబాటులో ఉంటుందని వివరించారు. సమస్యల్లో చిక్కుకుని బయటకు లేని పరిస్థితులున్న మహిళలు 181 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో సంస్థ కేస్ వర్కర్ తిరుమల, వీఓఏ రజిత, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే చట్టాల సద్వినియోగం

- సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు రతన్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న రతన్‌సింగ్

ఖానాపురం : చట్టాల పట్ల అవగాహన పెంచుకుంటే వాటిని సద్వినియోగం చేసుకోగలమని వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఠాకూర్ రతన్‌సింగ్ తెలిపారు. ప్రపంచ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ఐనపల్లి ఎంజేపీ స్కూల్‌లో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో వినియోగదారులను మోసగించడం పరిపాటిగా మారిందని ఆందోళన వెలిబుచ్చారు. ఏ వస్తువును అయినా అధీకృత సంస్థల ద్వారానే పొందాలన్నారు. మోసానికి గురైనట్టు భావిస్తే సత్వరమే సమాఖ్యను సంప్రదించి న్యాయం పొందాలని కోరారు. వినియోగదారుల చట్టాన్ని ప్రజలు వినియోగించుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్, స్వయంకృషి స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పర్వతగిరి : వేసవి కాలం మొదలైన నేపథ్యంలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి నీరజ ఆదేశించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని బోర్లు మరమ్మతు చేయించాలని, మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలుంటే పరిష్కరించాలని చెప్పారు. మండలంలోని అన్ని నర్సరీల్లో జూన్ నాటి మొక్కలు అందుబాటులో ఉంచడంతోపాటు ఖాళీ బ్యాగుల్లో నారు, విత్తనాలు వేయాలన్నారు. ఎంపీడీఓ మాలోతు శంకర్ నాయక్, ఎంపీఓ పాక రమేశ్ బాబు మాట్లాడుతూ గ్రామాల్లో టార్గెట్ ప్రకారం కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని తెలిపారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు, మెడికల్ కిట్, ఇతర సదుపాయాలు కల్పించాలని చెప్పారు. వారం రోజుల్లో పన్నులు నూరు శాతం వసూలు చేయాలని, ఎస్‌బీఎం మరుగుదొడ్లను నెలాఖరులోగా కట్టించాలని చెప్పారు.

మానవ అక్రమ రవాణాపై జాగ్రత్త

- ఎస్సై నరేశ్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై నరేశ్

సంగెం : మహిళలు మానవ అక్రమ రవాణపై జాగ్రత్తగా ఉండాలని ఎస్సై ఎల్.నరేశ్ కోరారు. మండల కేంద్రంలోని శాంతి మండల సమాఖ్య కార్యాలయంలో వీఓఏలకు, వీఓ అధ్యక్షులకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. కొందరు మోసపూరిత వ్యక్తులు అమాయకులను టార్గెట్ చేసి బాండెడ్ లేబర్‌గా, సెక్స్ వర్కర్లుగా మార్చుతున్నారని చెప్పారు. అలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పేదరికాన్ని ఆసరా చేసుకుని అసహాయులైన కొందరు మహిళలు, బాలికలను ఉద్యోగ అవకాశాల పేరుతో డబ్బు ఆశ చూపి వివిధ నగరాల్లో అమ్ముతున్నారని తెలిపారు. చిన్నారులను కిడ్నాప్ చేసి భిక్షాటన చేయిస్తున్న, అవయవాల మార్పిడికి పాల్పడుతున్న, లైంగిక వాంఛ తీర్చుకుంటున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. మహిళలు చైతన్యవంతం కావాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కల్యాణి, కార్యదర్శి రాజమణి తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు దీటుగా ప్రభుత్వ స్కూల్

- ఎంఈఓ లింగారెడ్డి

పర్వతగిరి : మండలంలోని బూర్గుమళ్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా కొనసాగుతోందని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) గాయపు లింగారెడ్డి తెలిపారు. ఆ స్కూల్‌లో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు, ఉపాధ్యాయులతో తయారు చేయబడిన బోధనా కృత్యాలను ప్రదర్శించారు. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవుతున్న వారిని ఘనంగా సత్కరించారు. అకడమిక్ అంశాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి సీఐ సట్ల కిరణ్‌కుమార్ సొంత డబ్బుతో బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ లింగారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు ప్రగతిని ప్రదర్శిస్తూ విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉత్తమ సందేశం ఇస్తున్నారని చెప్పారు. సీఐ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం పాక రమేశ్ బాబు, పాఠశాల కమిటీ చైర్మన్ గంజి భవానీ, ఉపాధ్యాయులు జగదీశ్వరి, సుమన్, కల్యాణి, మధుసూదన్, చంద్రభాను, రజనీదేవి, రమేశ్, దివ్య, రాజు, సంతోశ్, ఎమ్మార్సీ ఉద్యోగులు ప్రవీణ్, శిల్ప, జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

'పార్టీ బహిష్కృతులకు గుణపాఠం తప్పదు'

నర్సంపేట : ఎంసీపీఐ(యూ) నాయకత్వంపై ఆరోపణలు చేస్తున్న పార్టీ బహుష్కృత అరాచకవాదులకు గుణపాఠం తప్పదని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి మహ్మద్ రాజా సాహెబ్ అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సీనియర్ నాయకుడు నాగెల్లి కొమురయ్య అధ్యక్షతన గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి రాజా సాహెబ్ అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీని దేశవ్యాప్తంగా విస్తృతపర్చడంలో పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే ఓంకార్ ఎనలేని కృషి చేశారని చెప్పారు. సైద్ధాంతిక విభేదాలతో చీలిన కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసి వామపక్ష ఉద్యమాలను బలోపేతం చేసే దిశగా పార్టీ పేరు చివర యూనిటీ అనే పదాన్ని జోడించారని తెలిపారు. ఈ విషయమై పార్టీ నుంచి బహిష్కరణకు గురైన పానుగంటి నర్సయ్య, సంగతి సాంబయ్య, మొగిలిచర్ల సందీప్, తదితరులు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఓంకార్, బీఎస్.రెడ్డి పేర్లను ఉచ్చరించే నైతిక హక్కు సదరు బహిష్కృతులకు లేదన్నారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబ బాబురావు, వంగల రాగసుధ, డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి, మండల కార్యదర్శులు సింగతి మల్లికార్జున్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.